జనావాసాల మధ్య బ్లాస్టింగ్!

- పగుళ్లు తీసిన సమీపంలోని ఇళ్లు
- భయాందోళనలో స్థానికులు
- వరద సమస్య లేకున్నా.. కాలువ నిర్మిస్తున్నారని ఆగ్రహం

మన్సూరాబాద్: అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు చేస్తూ కాంట్రాక్టర్, జీహెచ్‌ఎంసీ అధికారులు తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. వరద సమస్య లేని ప్రాంతాల్లో కూడా వరద నీటి కాలువ పనులు చేపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. కాలువ తవ్వుతున్నప్పుడు గ్రానైట్ రాయి రావడంతో కాంట్రాక్టర్ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా దానిని పగులగొట్టేందుకు బ్లాస్టింగ్ కు పాల్పడ్డారు. దాని ధాటికి సమీపంలోని భవనాలకు పగుళ్లు ఏర్పడటంతో ఆ ఇళ్లలో ఉండేవారు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

- మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలోని కాకతీయ స్కూల్ నుంచి చంద్రపురికాలనీ రోడ్ నంబర్–5 వరకు సుమారు 1.3 కిలో మీటర్ల మేర రూ.1.90 కోట్ల నిధులతో వరద కాలువ పనులను నెల రోజుల నుంచి కాంట్రాక్టర్ చేస్తున్నాడు.
- పనులు చేస్తుండగా సెంట్రల్ బ్యాంక్ కాలనీలో భూగర్భంలో గ్రానైట్ రాయి వచ్చింది. దానిని పగులకొట్టేందుకు కాంట్రాక్టర్ ఏకంగా జెలిటిన్ స్టిక్స్ ఉపయోగించి బ్లాస్టింగ్ చేయించాడు.
- నివాస ప్రాంతాల్లో జెలిటిన్ స్టిక్స్ తో బ్లాస్టింగ్ చేయరాదు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఇలా చేసేందుకు అధికారులు కూడా అనుమతించరు. అన్నీ తెలిసి కూడా కాంట్రాక్టర్ శనివారం మధ్యాహ్నం బ్లాస్టింగ్ చేశాడు. స్థానికులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంతో పేలుడు శబ్దానికి ఏమైందో తెలియక ఆందోళనకు గురయ్యారు. పేలుళ్ల ధాటికి సమీపంలోని భవనాలు పగుళ్లు ఏర్పడ్డాయి .
- కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జక్కిడి తిరుమల్‌రెడ్డికి స్థానికులు వెంటనే సమాచారం ఇవ్వడంతో ఆయన ఘటనా స్థలానికి చేరుకుని ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు బ్లాస్టింగ్‌కు పాల్పడ్డ ఇద్దరు కార్మికులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు కార్మికులుతో పాటు కాంట్రాక్టర్ పరారయ్యాడు.
- అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌కు పాల్పడ్డ కాంట్రాక్టర్‌పై, సహకరించిన ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎవరి ప్రయోజనాల కోసం వరద కాలువ?

- వరద సమస్య రాని ప్రాంతంలో వరద కాలువ పనులు చేపట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌పీటీ మార్కెట్ వెనుక వైపు భారీ ఎత్తున 5 బ్లాక్‌లతో 11 అంతస్తుల అపార్ట్‌మెంట్ భవనాల నిర్మాణం పూర్తయ్యింది. సుమారు వెయ్యికి పైగా అపార్ట్‌మెంట్లను సదరు నిర్మాణదారులు పూర్తి చేశారు. అపార్ట్‌మెంట్ల డ్రైనేజీని కాలనీ డ్రైనేజీలో కలిపేందుకు ప్రయత్నించగా కాలనీవాసులు గతంలో అడ్డుకున్నారు.
- అపార్ట్‌మెంట్ డ్రైనేజీ నీరు వెళ్లేందుకు వరద కాలువ పేరుతో పైప్‌లైన్ పనులు చేపడుతున్నారని స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- బిల్డర్ల ప్రయోజనాల కోసం రూ.1.90 కోట్లతో వరద కాలువ పనులు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పూర్తి విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.


సెంట్రల్‌బ్యాంక్ కాలనీలో జరుగుతున్న వరద కాలువ పనులు


జెలిటిన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్ చేయటానికి ఉపయోగించే పరికరాలు

పగుళ్లు ఏర్పడ్డాయి



ఇది కాంట్రాక్టర్ అనాలోచిత చర్య. పనులు వేగంగా పూర్తి చే యాలని ఏకపక్షంగా జెలిటిన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్ చేసాడు. భారీ విస్ఫోటం కారణంగా సమీపంలోని ఇళ్ల కుదుపునకు గురై పగుళ్లు ఏర్పడ్డాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టా రాజ్యంగా పనులు చేపడుతున్నాడు. భారీ విస్ఫోటంతో ఇళ్ల నుంచి బయటకు పరుగెత్తాం.

– నరేందర్‌రెడ్డి, సమీప నివాసి

ఎవరి కోసం ఈ కాలువ పనులు



జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు వరద సమస్య ఉన్న ప్రాంతాన్ని వదిలేసి వరదలేని ప్రాంతంలో వరదకాలువ పనులు చేపడుతున్నారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ కాలువ పనులు చేపడుతున్నారో అధికారులు తెలియజేయాలి. ఎల్‌పీటీ మార్కెట్ వెనుక వైపు బహుళ అంతస్తుల నిర్మాణాల ప్రయోజనాల కోసం వరద కాలువ పేరుతో డ్రైనేజీని ఏర్పాటు చేస్తున్నారు.

– రవీందర్‌రెడ్డి , సమీప నివాసి

నోటీసులు జారీ చేశాం

వరద కాలువ పనుల్లో బ్లాస్టింగ్ చేయటానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. కాంట్రాక్టర్ ముందస్తు సమాచారం కూడా ఇవ్వలేదు. ఏకపక్షంగా బ్లాస్టింగ్ చేపట్టడంతో సదరు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశాం. నిబంధనల ప్రకారం చర్యలు చేపడతాం.

– రమేష్‌బాబు, హయత్‌నగర్ సర్కిల్ ఈఈ

బీఆర్‌ఎస్ నాయకుడు కాంగ్రెస్‌లో చేరిక


మధుయాష్కీ, ప్రకాష్‌గౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పాశం శ్రీకాంత్

నాగోలు: కొత్తపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, చైతన్యపురి డివిజన్ జీహెచ్‌ఎంసీ వార్డ్ సభ్యుడు పాశం శ్రీకాంత్ టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా పాశం శ్రీకాంత్ మాట్లాడుతూ, కొత్తపేట, చైతన్యపురి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. మహిళా నాయకులు దేవిరెడ్డి శ్వేతారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా స్నాతకోత్సవం


విద్యార్థులతో ఇన్‌స్పెక్టర్ సురేఖ, డీన్ జ్యోతి తదితరులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ రవీంద్రభారతి పాఠశాలలో శనివారం కిడ్స్ స్నాతకోత్సవం సందడిగా సాగింది. ఈ కార్యక్రమానికి సరూర్‌నగర్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సురేఖ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి ఇలాంటి స్నాతకోత్సవాలు దోహదపడతాయన్నారు. చదువుతో పాటు సామాజిక పరమైన అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జోనల్ డీన్ జ్యోతి, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, డీఐ దయాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబాను దర్శించుకున్న బీజేపీ అభ్యర్థి


మాధవీలతను సన్మానిస్తున్న చైర్మన్ రమేష్‌రెడ్డి

మలక్‌పేట: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత శనివారం సలీంనగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మితో కలిసి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్‌రెడ్డి ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. మహిళలు, యువత నుంచి బీజేపీకి విశేష ఆదరణ లభిస్తోందని, ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ స్థానం కై వసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పుల దినేష్, యాదగిరి సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

సత్కారం



మలక్‌పేట: రాజ్యసభ సభ్యుడి (ఎంపీ)గా ప్రమాణ స్వీకారం చేసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ కుమార్‌ను శనివారం యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి ప్రొద్దుటూరి సంగిరెడ్డి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనిల్ కుమార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అనాథ విద్యార్థి గృహం ఒక ఆలయం

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి


అనాథ విద్యార్థి గృహంలో వాష్ రూమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: అనాథ విద్యార్థి గృహం ఒక దేవాలయం అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆర్‌కే పురం డివిజన్ చిత్రా లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహం గ్రౌండ్ ఫ్లోర్‌లో నూతనంగా నిర్మించిన 14 వాష్ రూమ్స్, అధునాతన హెయిర్ కటింగ్ సెలూన్, వాషింగ్ మిషన్స్ సెంటర్‌ను శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనాథ విద్యార్థులకు భోజన, వసతితో పాటు ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో చదువు చెప్పించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్న అనాథ విద్యార్థి గృహం ఒక ఆలయం వంటిదని కొనియాడారు. ఉద్యోగులను పెట్టుకోకుండా విద్యార్థులకే హాస్టల్ నిర్వహణ, ఆర్థిక పరిపాలన బాధ్యతలు అప్పగించినందుకు గృహం కమిటీని అభినందించారు. అనంతరం గృహంలోని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో అనాథ గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్, ప్రధాన కార్యదర్శి పద్మజ, సలహా మండలి చెర్మన్ శశిమోహన్, కోశాధికారి సుప్రసన్న దేవి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జోరుగా ఇఫ్తార్ విందులు


పహాడీషరీఫ్‌లో ఎంపీ రంజిత్‌రెడ్డి, టీకేఆర్ తదితరులను సన్మానిస్తున్న ముస్లింలు

పహాడీషరీఫ్: రంజాన్ పండుగ సమీపిస్తుండడంతో ఇఫ్తార్ విందులు ఊపందుకున్నాయి. పార్లమెంట్ ఎన్నికల సమయం కావడంతో ప్రజా ప్రతినిధులు సైతం ముస్లింలకు ప్రత్యేకంగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రంజాన్ చివరి శుక్రవారం(జుమ్మాతుల్ విదా) రాత్రి జల్‌పల్లి మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విందులో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది పాల్గొన్నారు. పహాడీషరీఫ్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహమూద్ ఇచ్చిన విందులో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆమె తనయుడు కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. జల్‌పల్లిలో మాజీ ఉప సర్పంచ్ షేక్ జహంగీరుద్దీన్ ఇచ్చిన విందులో కేఎల్‌ఆర్‌తో పాటు పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, మస్న రవికుమార్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు కృషి


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రజనీవిఠల్‌రెడ్డి

హస్తినాపురం: విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు తమ విద్యాసంస్థల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. సాగర్‌రోడ్డులోని హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో శనివారం మాంటిస్సోరి విద్యార్థులకు కాన్వొకేషన్ డేను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు నల్లగౌనులు ధరించి పట్టాలు అందుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ గుమ్మకొండ రజనీ విఠల్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రావు, ఇన్‌ఛార్జీలు సవిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


నరేశ్ (ఫైల్)

చైతన్యపురి: భార్యతో గొడవల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఈ విషాద ఘటన జరిగింది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం ... కొత్తపేట సీటీఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డేరెంగుల నరేశ్ (33)కు బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన శిరీషతో 2020లో పెళ్లి జరిగింది. కొంత కాలం తర్వాత భార్యాభర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో శిరీష తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. గతేడాది మార్చిలో నరేశ్ ఉద్యోగ రీత్యా న్యూజిలాండ్‌కు వెళ్లగా, జూలైలో శిరీష మగబిడ్డకు జన్మనిచ్చింది. పెద్ద మనుషుల సమక్షంలో భార్యాభర్తల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఈ ఏడాది జనవరిలో నరేశ్‌ను ఇండియాకు రప్పించారు. మార్చి 27న ఇద్దరి మధ్య మళ్లీ గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన నరేశ్ శనివారం తన బెడ్‌రూంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు నవీన్ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కాంగ్రెస్‌కే జాతీయ బీసీ సంఘం మద్దతు

ఆకుల రాజేశ్వర్‌యాదవ్



మాట్లాడుతున్న ఆకుల రాజేశ్వర్‌యాదవ్

సైదాబాద్: బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతంపైగా రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ జాతీయ మేనిఫెస్టోలో ప్రకటించడం హర్షణీయమని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆకుల రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. శనివారం సైదాబాద్‌లో నిర్వహించిన జాతీయ బీసీ సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. అందువల్ల రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే జాతీయ బీసీ సంఘం మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కులగణన చేపడతామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరుస్తున్నామన్నారు. తెలంగాణలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలలోని బీసీలందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో సంఘం నాయకులు రవికుమార్ చారి, కుమార్, పూసల సత్యనారాయణ, జగదీష్ గౌడ్ పాల్గొన్నారు.

జనజాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


సభకు వెళ్తున్న వారితో మధుయాష్కీ

మన్సూరాబాద్: తుక్కుగూడ రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జనజాతర సభకు మన్సూరాబాద్ డివిజన్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జాల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ఇరిగే రమేష్, కొలను సుధాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 32 బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 18, క్యారెట్ 23, దొండ 18, ఆలు 31, ఉల్లి 22, గోకర 28, దోస 16, సొర 07, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 45, అర్వి 38, మునగ 18, చిలగడదుంప 65, బీట్‌రూట్ 23, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 65. ఆదివారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు పలుచోట్ల బీజేపీ జెండాను ఎగురవేసి ప్రసంగించారు. అలాగే, టిఫిన్ బైఠక్ కార్యక్రమాలు నిర్వహించి త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.


అభ్యుదయనగర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న గరికపాటి మోహన్ రావు, సామ రంగారెడ్డి తదితరులు


దిల్‌సుఖ్‌నగర్‌లో.. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి


నాగోలులో... చింతల సురేందనాథ్ యాదవ్ తదితరులు


కుర్మగూడలో .. మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ తదితరులు


చంపాపేట చౌరస్తాలో జెండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

400 స్థానాల్లో విజయమే బీజేపీ లక్ష్యం

వనస్థలిపురం: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వనస్థలిపురం హిల్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ మాజీ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు హాజరై మాట్లాడారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 400 స్థానాల్లో విజయం సాధించడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపునకు నాయకులు సమష్టిగా కృషి కృషి చేయాలని కోరారు. అనంతరం అభ్యుదయనగర్‌లో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, నూతి శ్రీనివాస్, మధుకర్‌గౌడ్, బద్దం రాంరెడ్డి, కిరణ్‌యాదవ్, భద్రరాజు, రాజ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, చిన్నా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో గెలుపు ఖాయం: సంరెడ్డి

సైదాబాద్: పాతబస్తీలో మజ్లిస్ ఎన్ని అవాంతరాలు సృష్టించినా ఈసారి హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని పార్టీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సైదాబాద్ డివిజన్ రెడ్డిబస్తీలో పార్టీ నాయకులతో కలిసి బీజేపీ జెండా ఎగురవేసారు. అనంతరం బూత్‌స్థాయి కమిటీతో టిఫిన్ బాక్స్ బైఠక్‌లో పాల్గొన్నారు.

- ఐఎస్‌సదన్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డితో కలిసి పార్టీ జెండాను ఎగురవేశారు. పాతబస్తీలో అన్నివర్గాల వారు ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు సహకరించాలని కోరారు.

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ జంక్షన్‌లో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, దిల్‌సుఖ్‌నగర్‌లో భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మడిగల లక్ష్మారెడ్డి, సలీంనగర్ బీజేపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాధవీలత బీజేపీ జెండాను ఎగురవేశారు.

- మన్సూరాబాద్ చౌరస్తాలో స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, చంపాపేట చౌరస్తాలో కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు.

నాగోలులో...

నాగోలు: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగోలులో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి చింతల సురేంద్రనాథ్ యాదవ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు సిద్దాల ఐలయ్య, వస్పారి మల్లేష్, పాల్వాయి సంజీవరెడ్డి, కేసీరెడ్డి పద్మ రెడ్డి, రాధిక, కొండబత్తుల శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

కొత్తపేటలో...

కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ చౌరస్తాలో బీజేపీ డివిజన్ నాయకులు మంచి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం పోలింగ్ కేంద్రంలో టిఫిన్ బాక్స్ బైఠక్ నిర్వహించి పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నాయకులు గీత రెడ్డి, అంబల మల్లేష్, దాస్ గౌడ్ నిరాంకి రవి, మహేందర్ యాదవ్, కొత్త తిరుమల, యాదయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

- బీజేపీ రాష్ట్ర నాయకులు యశ్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో మోహన్‌నగర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరణ చేశారు. నాయకులు కాటదాస్‌గౌడ్, కులకర్ణి, రాజేందర్, భాస్కర్ గౌడ్, కిరణ్ కుమార్, వినోద్, తరుణ్ సింగ్ ఠాకూర్ , అజయ్ సింగ్ పాల్గొన్నారు.

కుర్మగూడలో...

చంచల్‌గూడ: కుర్మగూడలో మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ బీజేపీ జెండాను ఎగురవేశారు. డివిజన్ అధ్యక్షుడు బండ వెంకట్‌రెడ్డి, నిరంజన్ యాదవ్, శ్రీనాథ్, సుధీర్, కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ మారుతి నగర్‌లో టిఫిన్‌బాక్స్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.